క్లుప్తంగా

నేడు మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలు

నరసరావుపేట: స్వాతంత్ర సమరయోధులు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం సోమవారం ఉదయం గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ నేతలు, ముస్లిం సోదరులు, కార్యకర్తలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాదెండ్ల: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌లో సోమవారం ప్రారంభమవుతుందని బయ్యర్ బి.రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల తిమ్మాపురంలోని ఉమామహేశ్వర కాటన్‌మిల్లులో కేంద్రం ప్రారంభించామన్నారు. ఉదయం 10 గంటల నుంచి పత్తికొనుగోలు చేస్తామని, ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు ఆర్‌బీకేల్లో రిజిష్టర్ చేయించుకుని తగిన ఆధారాలతో పత్తిని తీసుకొని రావాలన్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.7521లు గరిష్టంగా లభిస్తుందన్నారు. 8–12 మధ్య తేమ శాతం ఉన్న పత్తినే కొనుగోలు చేస్తామన్నారు. రైతులు నిబంధనల మేరకు పత్తిని ఆరబెట్టుకుని ప్లాస్టిక్ బ్యాగుల్లో కాకుండా గన్నీ బ్యాగుల్లో లేదా లూజుగా తరలించాలని కోరారు.

వృద్ధురాలి కార్నియాల సేకరణ


దొప్పలపూడి లింగమ్మ(ఫైల్)

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన దొప్పలపూడి లింగమ్మ (82) ఆదివారం మృతి చెందారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు మృతురాలి రెండు నేత్రాలు దానం చేయటానికి అంగీకారం తెలిపారని అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో–ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు తెలిపారు. పెదకాకాని శంకర కంటి వైద్యశాల వైద్యులు కార్నియాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు దొప్పలపూడి శ్రీనివాసరావు, నాగమ్మ, అంజమ్మ, వెంకటేష్, ప్రమీల, శంకర వైద్యశాల వైద్యులు వందన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా అలెగ్జాండర్

నరసరావుపేట: కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలెగ్జాండర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియచేశారు.

కార్తిక వన సమారాధన

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పురుషోత్తమపట్నం ఉసిరిక తోటలో ఆదివారం కార్తిక సమారాధన జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ది టెక్స్‌టైల్స్ డీలర్స్ అసోసియేషన్, షటిల్–బ్యాడ్మింటన్ ఫ్యామిలీ మెంబర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల సభ్యులు, కుటుంబాలతో విచ్చేశారు. కార్తిక మాస పూజలు నిర్వహించి మాసం విశిష్టతను తెలియజేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నరసరావుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆదివారం పరిశీలించారు. కాలువ కల్వర్ట్ పనులు, బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిలకలూరిపేటటౌన్: అనారోగ్య కారణాలతో వివాహిత పురుగులు మందు సేవించి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటపాలెం గ్రామానికి చెందిన సాతుపాటి నాగలక్ష్మికి(34) సుమారు 15 ఏళ్ల కిందట వివాహం అయింది. ఆమెకు ముగ్గురు సంతానం ఉన్నారు. కొద్దిరోజులుగా ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో శనివారం ఇంట్లో పురుగుల మందును సేవించి ఆత్మహత్య యత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగలక్ష్మి తల్లి కుంభా పోలేరు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలకు నెలవు

- నరసరావుపేట డీ మార్టు చుట్టూ పెరుగుతున్న ఆక్రమణలు
- అనధికారిక బంకులు ఏర్పాటు చేస్తున్న చిరు వ్యాపారులు
- భవిష్యత్‌లో మరిన్ని ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని మున్సిపల్, పోలీసు అధికారులు


డీ మార్టుకు ఎదురుగా రోడ్డుకు రెండోవైపున గోడను ఆనుకొని ఏర్పాటు చేస్తున్న బంకులు

నరసరావుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇటీవల ప్రారంభించిన డీమార్టు చుట్టూ ఆక్రమణలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలకు భవిష్యత్‌లో ట్రాఫిక్ కష్టాలు ఎదురుకానున్నాయి. ఓ టీడీపీ నాయకుడు ఆర్టీసీ స్థలాన్ని 2014–19 మధ్య 33 ఏళ్ల లీజుకు తీసుకొని డీమార్టు నిర్మాణం ప్రారంభించారు. గత ఐదేళ్లుగా నిర్మాణంలో ఉన్న డీ మార్టు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలరోజుల క్రితం ప్రారంభమైంది. దీంతో డీ మార్టును ఒకసారైనా సందర్శించాలనే ఉద్దేశంతో ప్రజలు తండోప తండాలుగా వస్తున్నారు. డీమార్టుకు వచ్చేవారు తీసుకొస్తున్న వాహనాలు పెట్టుకునేందుకు నిర్వాహకులు భవనం సెల్లార్‌లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేసినా వాహనాలను అందులో పార్కింగ్ చేయకుండా ముందుభాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో, రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాటు ఎదురుగా ఉన్న రోడ్డుకు రెండోవైపున కొంతమంది చిరు వ్యాపారులు నాయకుల పేర్లు చెప్పుకొని హార్డు కాంపౌండ్, ఏపీ స్టేట్ గోదాముల కాంప్లెక్స్ గోడకు ఆనుకొని నూతనంగా అనధికారికంగా బంకులు ఏర్పాటుచేశారు.

ఆక్రమణలు తొలగిస్తాం..

పట్టణంలో ఏర్పాటు చేసిన అనధికార బంకుల విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. అనధికార ఆక్రమణలు అన్నింటిని తొలగిస్తాం. ఇప్పటికే వారిని హెచ్చరిస్తూ ప్రకటన చేశాం. పోలీసు, రెవెన్యూ వారి సహకారంతో రోడ్లకు ఇరువైపులా మార్జిన్లలో ఉన్నవాటినన్నిటిని తొలగింపజేస్తాం.

– ఎం.జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్

రాకపోకలకు ఇబ్బందులు..

ఉత్తరంవైపున ప్రకాష్‌నగర్‌లోకి వచ్చే రహదారి సైతం కొన్ని సమయాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలతో నిండిపోతుంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆర్టీసీ గ్యారేజ్ స్థలాన్ని లీజుకు ఇవ్వటంతో కొంతమంది మెకానిక్ షాపులు ఏర్పాటుచేసి రోడ్డుపైనే వాహనాలకు మరమ్మతులు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు దగ్గరగా ఉండటంతో బస్సుల రాకపోకలు అధికంగా ఉండటం, ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రోడ్డులో విపరీతమైన ట్రాఫిక్ నెలకొంది. దీంతో పాటు హార్డు జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల కూడా ఉండటంతో విద్యార్థులు రాకపోకలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనధికారికంగా ఏర్పాటుచేసిన బంకులలో వ్యాపారం ప్రారంభమైతే ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. వీటిని ఏర్పాటుచేస్తున్న వారిలో టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండటంతో మున్సిపల్, పోలీసు అధికారులు నిలువరించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవిష్యత్ ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో పెట్టుకొని అనధికారిక బంకులను తొలగించి, డీమార్టు వద్ద ట్రాఫిక్ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది.

గణపవరం హిందూ శ్మశాన వాటికలో వరుస చోరీలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో తరచూ చోరీలు జరుగుతున్నాయి. అంత్యక్రియలకు హాజరయ్యే వారికి కేటాయించిన గదుల్లోని ఫ్యాన్ల వైరింగ్, ఏసీ బాక్సు వైరింగ్‌లను కట్ చేశారు. దీంతో అంత్యక్రియలు చేసేందుకు వచ్చేవారికి అసౌకర్యం కలుగుతోంది. గత ప్రభుత్వంలో మేజర్ పంచాయతీ గణపవరం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించటంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఇటు పంచాయతీరాజ్ శాఖ నుంచి గానీ, మున్సిపల్ శాఖ నుంచి గానీ గ్రాంట్లు, నిధులు రావటం లేదు. కేవలం ఆస్తిపన్నులు, నీటి చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు మాత్రమే వసూలు అవుతోంది. గ్రామ పంచాయతీకి ఆదాయం తగ్గటంతో పంచాయతీ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇటీవల సమావేశం నిర్వహించారు. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే పలువురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. శ్మశాన వాటికలో వాచ్‌మెన్‌గా పనిచేసే వ్యక్తిని తొలగించారు. అప్పటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు స్మశానంలో ప్రవేశిస్తున్నారు. శ్మశాన వాటికను ఆనుకుని కొంతభూమి ఉండగా, భూయజమాని కంపచెట్లు నరికి స్మశాన వాటికలో పడేశాడు. దీంతో శ్మశాన వాటికలోని పైపులైను పగిలిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇలా పలు సమస్యల కారణంగా అంత్యక్రియలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీబాబును వివరణ కోరగా, పైపులైను మరమ్మతులు చేయించామన్నారు. మార్చురీబాక్సు మరమ్మతులు చేయించామన్నారు. ఫ్యాన్ల రిపేర్లు చేయించాలన్నారు. ఆకతాయిలు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం మండల కన్వీనర్ వెంకటేశ్వర రాజు తదితరులు

రొంపిచర్ల: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం పనిచేస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు ప్రచార యాత్ర సందర్భంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్‌లు ఇవ్వాలన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. చెరువుగట్టు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు గడపగడపకు తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. రొంపిచర్ల సీపీఎం శాఖ కార్యదర్శి అంగులూరి ఫణీంద్ర, పలపల రామిరెడ్డి, పంబా కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల పరిశీలన


మద్యం దుకాణం పరిశీలనకు వచ్చిన ఎక్సైజ్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు

ఈపూరు: ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీకి మాత్రమే మద్యం విక్రయించాలని, 21 సంవత్సరాల లోపు వారికి మద్యం విక్రయించరాదని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. లేనిచో చట్టప్రకారం, నిర్దేశిత నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. బెల్ట్ దుకాణాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని, ఇప్పటివరకు ఈ నెలలో మూడు అక్రమ మద్యం కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. అలాగే ఎన్‌డీపీఎల్ మద్యం, నాటుసారా, గురించి ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని, ఎన్‌డీపీఎల్ తదితర అక్రమ మద్యం, సారాయి సంబంధిత నేరాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణపవరం–నాదెండ్ల డొంకరోడ్డుకు మరమ్మతులు


డొంకరోడ్డుపై పోసిన మెటల్

నాదెండ్ల: చిలకలూరిపేట నుంచి గణపవరం మీదుగా నాదెండ్ల వెళ్లే డొంకరోడ్డు మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో 13 కిలోమీటర్ల నిడివిలో రూ.40 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు ఏఈ రవీంద్ర తెలిపారు. ఏఎంజీ పక్కన గల పెట్రోల్ బంకు నుంచి గణపవరం వరకు రోడ్డు గతుకులతో అధ్వానంగా మారింది. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి తటాకాన్ని తలపించేది. ఇదీగాక చిలకలూరిపేట పట్టణానికి చెందిన పలు కాలనీల మురుగునీరు ఈ డొంకలో చేరి తీవ్ర దుర్గంధం, బురద ఏర్పడేది. దీంతో ఈ రోడ్డు వెంట రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఈ రోడ్డు దుస్థితిని ప్రస్తావించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేపట్టారు. గణపవరం వరకూ రెండు వైపులా సైడు కాల్వల్లో సిల్టును తీశారు. మెటల్‌తో నింపి రోడ్డు రోలర్‌తో పనులు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ రక్షణకు చర్యలు చేపట్టాలి

దళిత సంఘాల నాయకుల డిమాండ్

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వాహనం శనివారం రాత్రి ఢీకొంది. దిమ్మె పాక్షికంగా దెబ్బతింది. దీంతో జై భీమ్ అభిమానులు స్పందించారు. మహనీయుడి విగ్రహాన్ని వాహనం ఢీకొనడానికి కారణం రాత్రివేళ అక్కడ చీకటిగా ఉండటమే అని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఇకపై అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారతరత్న విగ్రహానికి సముచిత గౌరవం ఇవ్వాలని అని దళిత సంఘాల నాయకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంతి నగర్‌కు చెందిన తన్నీరు రాఘవేంద్రరావు ఆటో ఎక్కి రావిపాడు రోడ్డు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా కొట్టింది.

సంఘటనలో రాఘవేంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడి భార్య కావ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చరణ్ తెలిపారు.

పేదలపై భారం సరికాదు


మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

అమరావతి: రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తగ్గించటం చేతకాని ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపటం సరికాదని సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల సీపీఐ కార్యదర్శి కె.చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసన వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని నమ్మబలికి మోసం చేసారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లు ప్రజలపై భారాన్ని మోపటం దారుణమన్నారు. విద్యుత్ కమిషన్ చెప్పిందన్న సాకుతో విద్యుత్ చార్జీలు పెంచటం తప్పదని చెప్పటం పేదలను మోసం చేయటమేనన్నారు. సరైన దిగుబడి రాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కుమిలిపోతూన్నారన్నారు. పత్తి, మిర్చి, అపరాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న విద్యుత్ మీటర్లు పెట్టే యోచన విరమించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలను ఆదుకోకపోతే వామపక్ష పార్టీలు మరో విద్యుత్ పోరుకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం మోపే ఆలోచన విరమించుకోవాలని, ఈ నెల 11న మంత్రి మండలి సమావేశంలో విద్యుత్ చార్జీల విరమణ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జె.యుగంధర్, గోపి, కె.మంత్రాలు, నందూరు జోజి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక అక్రమ రవాణా


ఇసుకను తరలించే మార్గం ఇదే..


గుండ్లకమ్మ నదిలో ఏర్పాటు చేసిన ఇసుక జల్లెడ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలు సమీపంలో గుండ్లకమ్మ నదిలో ఇసుకను అక్రమ రవాణా చేస్తూ కొంతమంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో ఏకంగా పొక్లెయిన్‌లు, ఇసుక జల్లెడలు ఏర్పాటు చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఇసుక సరఫరా సక్రమంగా చేయకపోవడంతో స్థానికంగా దొరికే ఇసుకకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇతర జిల్లాలకు కూడా గుండ్లకమ్మ నది నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. అధికారులు ఎవరూ ఇసుక రవాణాపై దృష్టి సారించకపోవడంతో ఇష్టానుసారంగా గుండ్లకమ్మ మొత్తం తవ్వేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లతో విశ్వం తోడేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం


దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం

బెల్లంకొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం తెలిపారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూ చిట్యాల, మాచాయపాలెం గ్రామాలలో శిబిరాలకు వెళ్లి ఆమె పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాలలో మండల వ్యాప్తంగా చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఫారం–7 దరఖాస్తులు 9, కొత్త ఓట్లు నమోదుకు ఫారం–6 దరఖాస్తులు 12 వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకయ్య, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది ధర్మ, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో రెండు ఆలయాల విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభాల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయం, సీతారాముల ఆలయాలను నిర్మించి, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయాలలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రెండు ఆలయాల ప్రతిష్ట కావడంతో గ్రామంలో మూడు రోజులుగా పండుగ సందడి నెలకొంది. వేద పండితులు హోమ కార్యక్రమాలు నిర్వహించి, పూజలను చేశారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మాజేటి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో 125 మంది దంపతులు పాల్గొన్నారు. అర్చకులు సత్యనారాయణ వ్రత విశిష్టతను తెలియజేశారు. దంపతులు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో కోటా ప్రసాదరావు, కొప్పురావూరి ఆంజనేయులు, చిలంకూరి యోగేశ్వరరావు, చేగు వెంకటేశ్వరరావు, గాదంశెట్టి రాంబాబు, గట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్ సందర్శన


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేటటౌన్: ఇకపై శివారు ప్రాంతాల నివాసితులకు సురక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని మంచినీటి చెరువు వద్ద ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. ప్లాంట్ నీటిశుద్ధి యంత్రాల మరమ్మతులను పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ పట్టణంలోని ఈనెల 20వ తేదీ నుంచి ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ప్లాంట్ ఆర్గనైజర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు జి.మదన్, బండారుపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేటటౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ చిలకలూరిపేట డిపో మేనేజర్ ఎస్.రాంబాబు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలో తిరుగుతున్న ఆర్టీసీ సర్వీసుల సేవలు, సమస్యలపై ప్రయాణికులు తమ సందేహాలు, ఫిర్యాదులు అందించాలని కోరారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్‌నంబర్ 9959225427కు ఫోన్ చేసి మాట్లాడాలన్నారు.